క్లుప్తంగా

ఆధార్ కేంద్రం లేక కేవైసీకి ఇబ్బందులు

మరికల్: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ముకుందరెడ్డి, తిరుపతిరెడ్డి, రవి, రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రేషన్‌కార్డుల పూనరుద్ధరణ కోసం కేవైసీకోసం రేషన్‌దుకాణాలకు వస్తున్న ప్రజలు ఆధార్ కార్డుల్లో తప్పులు ఉండటంతో కేవైసీ రావడం లేదన్నారు. మండలంలో మూతపడ్డిన ఆధార్ కేంద్రాన్ని తెరిపించాలని వారు డిమాండ్ చేశారు.

తరలిన బీఆర్ఎస్ నాయకులు



ధన్వాడ: పాలమూరు –రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చూసేందుకు మండల కేంద్రం నుంచి బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. మండల కేంద్రం నుంచి అన్నిగ్రామాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మూడు బస్సులో తరలివెళ్లారు.

వికలాంగులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలి



కృష్ణా: ప్రభుత్వం వికలాంగులకు రూ. 10వేల పెన్షన్ ఇవ్వడంతోపాటు వికలాంగుల బంధుపథకాన్ని అమలు చేయాలని ఎన్‌పీ ఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు కాశప్ప, ఉపాధ్యక్షుడు బాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని క్షీర లింగేశ్వర ఆలయంలో మండల వికాలాంగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టంలోని అంశాలను అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో తాము ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం అక్టోబర్ 9న చలో హైదరాబాద్ ధర్నా సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడిగా కృష్ణా, ఉపాధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా ఆనంద్ ఎన్నికైనట్లు తెలిపారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి



మక్తల్: రాష్ట్రంలో మినీ డీఎస్సీ కాకుండా మెగా డీఎస్సీ నిర్వహించాలని ఆదివారం పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తాలో డీఎస్సీ అభ్యర్థులు రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణలో 13వేల 500 పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు అండగా ఉండాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులపై చిన్నచూపు చూస్తుందన్నారు. కార్యక్రమంలో భాస్కర్, పృథ్వీరాజ్, నరేందర్, వెంకటేష్, కురుమూర్తి, చెన్నకేశవులు, నాగేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో తాగు నీటి కుళాయిలకు ఆన్ ఆఫ్‌లు లేక తాగునీరు వృథాగా పోతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుళాయిలకు ట్యాప్‌లు బిగించి మంచి నీటి వృథాపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'వర్కటం' వాహనంపై దాడి

ఊట్కూర్: బీఆర్ఎస్ నాయకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి వాహనంపై అదేపార్టీకి చెందిన కార్యకర్తలు దాడి చేసిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. సోషల్ మీడియాలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేశారని పెద్దజట్రం చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వర్కటం జగన్నాథ్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు ఆయనను పిలిపించారు. విచారణ అనంతరం ఆయన తిరిగి మక్తల్‌కు వెళ్తుండగా గాంధీనగర్ ప్రాంతంలో బీఆర్ఎస్ కార్యకర్తలు వర్కటం వాహనాన్ని అడ్డుకున్నారు. ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని నిలదీశారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోకారి సిబ్బందితో వచ్చి వారిని శాంతింపజేశారు. అప్పటికే కొందరు వాహనంపై దాడిచేడంతో పాక్షికంగా దెబ్బతింది. తాను పోలీసుస్టేషన్‌కు వచ్చి తిరిగి మక్తల్‌కు వెళ్తుండగా ఎమ్మెల్యే అనుచరులు తన వాహనంపై దాడి చేశారని వర్కటం తెలిపారు. ఈ విషయమై మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే చివరికి వర్కటం జగన్నాథరెడ్డి క్షమాపణ చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

ఘనంగా బసవేశ్వరస్వామి పల్లకీసేవ



నందికోళ్లు ఆడుతున్న యువకుడు..



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని బసవేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రావణమాస ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బుస్సయ్యస్వామి ఆధ్వర్యంలో అర్చకులు మంజునాథస్వామి, విశ్వనాథ్‌స్వామి ఆలయంలోని మూలవిరాట్‌కు పవిత్ర గంగాజలంతో అభిషేకం చేశారు. ఆదేవిధంగా సుప్రభాత సేవా, రుద్రాభిషేకం, అష్టోత్తరశతనామావళి, బిల్వార్చన, అలంకారసేవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పట్టణ పురవీధులగుండా లింగయ్య గుడి వరకు పల్లకీసేవ కనుల పండువగా నిర్వహించారు. మహిళల మంగళహారతులు, ఖడ్గ విన్యాసాలతో పూర్తి చేసి ఆలయంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలింగం, జగదీష్, జయప్ప, శంకర్, రాజేష్, రవికుమార్, వినోద్, శశిధర్, మల్లికార్జున్, విశ్వనాథ్, మహేష్, మల్లు, మణి, సంపత్, రాకేష్, సుజాత, రజిత, నాగమణి, శైలజ, పవిత్ర, లలిత, వీరశైవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కృష్ణా: మండలంలోని కున్సిలో జైన మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శివప్పసోకార్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన జైన మతగురువు విజయరాజ్ తిలక్ సురూజీకి నేటితో 101 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. పూజ కార్యక్రమానికి మండల ప్రజలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై స్వామి కృపకుపాత్రులు కాగలరని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నర్వ: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బీఆర్ఎస్ నాయకులు గడ్డం నర్సింహులు తల్లి ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి మాట్లాడారు.. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎమ్మెల్యేతోపాటు నాయకులు దండు అయ్యప్ప, డా.శంకర్, సుధీర్, డా. వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి

కోస్గి: మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యల సాధన కోసం ఈ నెల 28నుంచి సమ్మెబాట పడుతున్నారని, తమ సమస్యల సాధనకోసం కార్మికులంతా ఏకమై సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటయ్య సూచించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహ ఆవరణలో కార్మికులతో సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ.. గత 9నెలలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని, కార్మికులకు రూ.2వేల పెరిగిన వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు మణిమాల, ఆశమ్మ, పద్మమ్మ, షభాన బేగం పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి వీడ్కోలు



లక్ష్మీదేవిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన టీచర్లకు సన్మానం చేయడం సాధారణంగా చూస్తుంటాం. కాని ఓ ప్రైవేట్ పాఠశాలలో 30సంవత్సరాల పాటు పనిచేసి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన మహిళ టీచర్ పదవీవిరమణ పొందితే ఆదివారం ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక శిశుమందిర్ స్కూల్‌లో 1991 నుంచి విధులు నిర్వహించిన కందికొండ లక్ష్మీదేవికి తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. ఆమెకు సంబంధించిన పీఎఫ్, గ్రాట్యూటీ చెక్కులను సైతం పాఠశాల కమిటీసభ్యులు అందజేశారు. కార్యక్రమంలో రతంగపాండురెడ్డి, మద్ది అనంత్‌రెడ్డి, సీతారాములు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ పూజలు



ఊట్కూరులో ప్రత్యేక పూజలలో పాల్గొన్న బాలకృష్ణారెడ్డి



మట్టివినాయకుడికి హారతి ఇస్తున్న శ్రీ హంసవాహిని విద్యార్థులు



నర్వలో..

నారాయణపేట రూరల్ : పట్టణంలో వివిధ ఆలయాలు, మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడికి ఏడోరోజు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయివిజయకాలనీలో ప్రతిష్ఠించిన గణనాథుడికి ప్రముఖ వైద్యులు గీత, విశ్వనాథ్ ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. అదేవిధంగా శ్రీహంసవాహిని స్కూల్‌లో ఏర్పాటుచేసిన మట్టి వినాయకుడికి విద్యార్థులు ఆదివారం ప్రత్యేక వంటకాలతో నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

ఊట్కూరు: మండలంలోని ఆదివారం కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణారెడ్డి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. సర్దార్‌నగర్, మేన్‌బజార్, ఈశ్వర్ మందీర్, శివాజీనగర్ తదితర మండపాల వద్దకు వెళ్లి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హన్మంతు, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, రవికుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి చేశారు. ఉండ్రాల పాయసంతో నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



నారాయణపేట సాయివిజయకాలనీలో గణనాథుడిని దర్శించుకుంటున్న మహిళలు

నిమజ్జనానికి తరలిన వినాయకుడు



కందెన్‌పల్లిలో నిమజ్జన వేడుకలు



కాన్‌కుర్తి భజరంగ్‌ధల్ వినాయకుడి చంద్రయాన్ త్రి ప్రదర్శన

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి, కందెన్‌పల్లి తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకులు ఆదివారం నిమజ్జనానికి తరలారు. మండపాల్లో వారం రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను ప్రత్యేక అలంకరణతో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. స్థానిక సర్పంచ్‌లు ఎంపీటీసీలు, నాయకులు ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

బీసీ సేనా జిల్లా మహిళ అధ్యక్షురాలిగా రాధమ్మ



రాదమ్మకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

మద్దూరు: జిల్లా బీసీ సేనా మహిళా అధ్యక్షురాలిగా మండలంలోని చింతల్‌దిన్నే గ్రామానికి చెందిన రాధమ్మను ఎంపిక చేసినట్లు బీసీ సేనా రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమెను ఎంపిక చేశారు. జిల్లా బీసీ మహిళలను చైతన్యపర్చడానికి తనవంతు కృషిచేస్తానని నూతనంగా ఎన్నికైన రాదమ్మ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, నాయకులు భాస్కర్, మాణిక్‌షా, భీమ్‌రాజ్, మణికంత మొగులప్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దాతలకు సన్మానం



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నారాయణపేట రూరల్ : మండల పరిధిలోని లోకాయపల్లి లక్ష్మమ్మ ఆలయంలో ఆదివారం కమిటీ సభ్యులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనులకు సహకరించిన దాతలను ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. అంతకుముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రావణమాస ఉత్సవాల్లో రూ.7.14లక్షల ఆదాయం రాగా రూ. 4.15లక్షలను ఖర్చుచేసినట్లు లెక్కలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు హరినారాయణబట్టడ్, అధ్యక్షులు డాక్టర్ రాంబాబు, సెక్రటరీ మధుసూదన్ రెడ్డి, లప్ప అశోక్, కన్నుజగదీష్, దినేష్ లాహోటీ, రాంరెడ్డి, ఆత్మారాం, శ్రీనివాస్, శంక్రమ్మ, అర్చకులు సోమశేఖర్‌స్వామి, దాతలు కిరీటి, సంధ్యారాణి, వెంకటరమణ సాగర్, రవికుమార్‌గౌడ్, శశికాంత్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కున్సిలో బీఎస్పీ జెండా ఆవిష్కరణ



కున్సిలో బీఎస్పీ జెండాను ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ

కృష్ణా: రాష్ట్రంలో బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడుతున్నామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీలో ఉంటుందని, తమ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అందుకు గాను గ్రామ గ్రామాన పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బస్వరాజ్, హమీర్, కృష్ణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: బీఎస్పీ మండల నూతన కమిటీని నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షురాలిగా కావలి రేణుకా, ఉపాధ్యక్షుడిగా మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కన్వీనర్‌గా నర్సింహులు, కార్యదర్శిగా ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు అశోక్, మల్లేష్, మొగులప్ప, లక్ష్మణ్, నారాయణ పాల్గొన్నారు.

మహిళా బిల్లులో వాటా తేల్చాలి..



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నర్వ: కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ మహిళల వాటా తేల్చాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మహిళా బిల్లును వ్యతిరేకిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం ప్రకారం 90శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు వాటా కల్పించేవరకు పోరాటం చేస్తామన్నారు. డీఎస్పీ నాయకులు డేవిడ్, ఈశ్వర్, గోపాలకృష్ణ, శ్రీనివాస్, మహేష్‌గౌడ్, రేణుక, వీరేష్, శివరాజ్, సురేష్, మన్యం, వెంకటేష్, కురుమూర్తి పాల్గొన్నారు.

యాదవులను రాజకీయ పార్టీలు గుర్తించాలి



మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

మరికల్: యాదవులను రాజకీయ పార్టీలు గుర్తించి న్యాయం చేయాలని యాదవ సంఘం రాష్ట్ర నాయకులు రఘువీర్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.. రాజకీయ పార్టీల నాయకులు ముఖ్యంగా యాదవులను కేవలం ఓటు బ్యాంకు కోసం వాడుకొని వదిలేస్తున్నారని గుర్తుచేశారు. యాదవులు అధికశాతం ఉన్న అసెంబ్లీ టిక్కెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, రామకృష్ణ, రాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఊట్కూరు: మండలంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కార్మికులకు వైద్యపరీక్షలు చేశారు. పెద్దజట్రం, ఊట్కూరులో నిర్వహించిన వైద్య శిబిరంలో కార్మికులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలతోపాటు రక్తపరీక్షలను చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, కతలప్ప, మండల కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహమాన్, నాయకులు నాగేష్, లక్ష్మయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి



నారాయణపేటలో చిన్నారులతో కలిసి నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కోస్గిలో



మక్తల్‌లో..

నారాయణపేట: అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలని ఆదివారం జిల్లా వ్యాప్తంగా నారాయణపేట, మద్దూర్, మక్తల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు, హెల్పర్లకు మద్దతుగా లబ్ధిరులు నిలుస్తూ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు 10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీల వద్ద నిరసన తెలిపారు.

మక్తల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారంతో 14వ రోజుకు చేరింది. ఈ మేరకు అంగన్‌వాడీలు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవింద్‌రాజు, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీహరి, ఏఐటీయూసీ నర్సింహ, విజయలక్ష్మి, జమున, రాధిక, శ్రీలత, అంబిక, జయమ్మ, కవిత, లక్ష్మి, సుకన్య, సునీత, సురేఖ, మల్లమ్మ, లింగమ్మ, వెంకటమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కోస్గి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11 నుంచి అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం అంగన్‌వాడీల ద్వారా లబ్ధిపొందుతున్న వారు సమ్మెకు తమ మద్దతు ప్రకటించారు. ఇందులో భాగంగా ఆదివారం పలు కేంద్రాల్లో లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు చేరుకొని తమ కేంద్రాల టీచర్ల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆయా కేంద్రాల అంగన్‌వాడీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మరికల్: అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలని ఆదివారం పెద్దచింతకుంటలో పిల్లలతోపాటు వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బాలరాం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బంది 14రోజులుగా రిలే నిరహారదీక్ష చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకొని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

ఊట్కూరు: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సర్పంచ్ సావిత్రమ్మ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బిజ్వార్‌లో అంగన్‌వాడీల సమ్మెకు గ్రామస్తులు మద్దతు తెలిపి మాట్లాడారు.. గత 14 రోజులుగా అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారంకోసం శాంతియుతంగా సమ్మెచేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు యశోద, ఆంజనేయులుగౌడ్, సలీం, గోవిందు, అశోక్, సిద్దు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం కంభాళాపురం గ్రామానికి చెందిన రామన్‌గౌడ్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆదివారం రామన్‌గౌడ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. శ్రీహరిరాజు, ఆశన్న, ఈశ్వర్, శివనారాయణ, వేముల శ్రీధర్, చందు, ఆంజనేయులు, నిరంజన్, అశోక్, శివ పాల్గొన్నారు.